## సింగరేణి పరిరక్షణ సదస్సును విజయవంతం చేయండి



**మందమర్రి జూన్ 30 (తెలంగాణ వాణి విలేకరి)**
సింగరేణి మనుగడకోసం టి బి జి కె ఎస్ ఆధ్వర్యం లో జులై 01 స్థానిక ఎం ఎం ఆర్ గార్డెన్ లో నిర్వ హించే సింగరేణి పరిరక్షణ సదస్సులో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని టి బి జి కె ఎస్ అధ్యక్షులు మిర్యాలరాజిరెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం ప్రెస్ క్లబ్ సమావేశం లో ఆయన మాట్లాడుతూ కె సి ఆర్ ప్రభుత్వ హాయం లో కాసిపేట 2 అండర్ గ్రౌండ్ గని ఏర్పడిందని, కేకే ఓసి గని ఎక్స్ టెన్షన్ చేసి అనేక యువ కార్మి కులకు ఉద్యోగ అవ కాశం కల్పించిన ఘనత కేసీఆర్ కె దక్కుతుందని అన్నారు. సత్తుపల్లి 3,కోయగూడ 3 గనులకు పర్యావరణ అనుమతులు లేక నిలిచి పోయినప్పటికి కాంగ్రెస్ ప్రభుత్వం దాని అను మతులు తేవడం లో విఫ లం చెందిందని అన్నారు. కాంగ్రెస్ అంటే అవినీతి అక్రమాలకు నిలయమని, రెండేళ్ల పాలనలో కాంట్రా క్టర్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ సింగరేణి ని దివాల తీసేందుకు, ప్రయి వేటి కరణ చేసేందుకు కుట్రలు పన్నుతూ సింగరేణి సంస్థను నష్టాల ఊబిలోకి నెడుతున్నారని ఆరోపించారు. సింగరేణి నేడు వసతుల లేమితో కనీసం కార్మికులకు తాగు నీరు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉందని అన్నా రు. తెలంగాణ కు తల మానిక మైన సింగరేణి ని రక్షించు కోవాల్సిన భాధ్య త కార్మికులపై ఉందని బుధవారం జరుగబోయే పరిరక్షణ సదస్సుకు ముఖ్య అతిథిలుగా మాజీ మంత్రి హరీష్ రావు, సంఘం గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్,మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమ న్, దివాకర్ రావు దుర్గం చిన్నయ్య తదితరులు హాజరు అవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశం లోమేడిపల్లి సంపత్, ఓ. రాజశేఖర్, దాసరి శ్రీనివాస్, బండారి సూరి బాబు, బోరిగం వెంకటేష్, భూపెల్లి కనకయ్య,బర్ల సధానందం పాల్గొన్నారు.

## మల్లాపూర్ మండల టీయూడబ్ల్యూజెహెచ్ 143 యూనియన్ (ప్రెస్ క్లబ్ ) ఎన్నికలు ఏకగ్రీవం



మెట్ పల్లి, జూన్ 30: మల్లాపూర్ మండల టీయూడబ్ల్యూజెహెచ్ 143 యూనియన్ (ప్రెస్ క్లబ్ ) ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. మంగళవారం మండల కేంద్రమైన మల్లాపూర్ వెంకటేశ్వర దేవాలయంలో నిర్వహించిన సమావేశంలో టీయూడ బ్ల్యూజెహెచ్ 143 యూనియ న్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగుల రాంగోపాల్,జిల్లా ప్రింట్ మీడియా అధ్యక్షులు శికారి రామకృష్ణ,ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు అంజు గౌడ్,కోరుట్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముక్కెర చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షులుగా సుతారి కృష్ణమాచారి,అధ్యక్షులుగా రుద్ర రాంప్రసాద్,ఉపాధ్యక్షు లుగా ఉడుగుల గంగాధర్, ప్రధాన కార్య దర్శిగా నూనె ఆంజనేయులు,కార్యదర్శి గా మోర సతీష్,కోశాధికారి గా ఆదరి రాజేందర్ ల ఎన్నుకు న్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రింట్ మీడియా ఉపా ధ్యక్షులు కనుక సంజీవ్,జిల్లా కార్యదర్శి తోకల పవన్, ఎలక్ట్రానిక్ మీడియా ఆర్గనైజింగ్ సెక్రటరీ పెంబి మహేష్,తాజా మాజీ అధ్యక్షులు ముత్యాల రమేష్, సభ్యులు ఆకుతోట నర్సయ్య,జరుపుల రమేష్, వంగ శేఖర్,దొంతి సుధాకర్, ఎగ్యారపు శ్రీనివాస్,బండారి వెంకటేష్,ముదంపల్లి మహేష్ పాల్గొన్నారు.

## అమెరికా 'ఆటా 'సదస్సుకు జీవి శ్యాంప్రసాద్ లాల్, పొన్నం రవిచంద్రలకు ఆహ్వానం





**కరీంనగర్, జూన్ 30 (తెలంగాణ వాణి)**
అమెరికాలో జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు జరిగే అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) యువజన సదస్సుకు కరీంనగర్ జిల్లాకు చెందిన ఐఏఎస్ అధికారి జీవి శ్యాం ప్రసాద్ లాల్,కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర కు ఆహ్వానం అందింది.అమెరికాలోని మేరీ ల్యాండ్ లో జులై 31 నుంచి ఆగస్టు 2 వరకు 19 వ'ఆట' ద్వైవార్శిక సదస్సు,మరియు యువజన సమ్మేళనంలో అతిథులుగా పాల్గొనడానికి ఆటా అధ్యక్షుడు జయంత్ చెల్లా ఇరువురిని ఆహ్వానిం చారు.ఈ సదస్సులో సాంస్కృ తిక యువజన కుటుంబ వృత్తి పరస్పర అంశాలపై మూడు రోజులు అమెరికా లోని అన్ని రాష్ట్రాల్లో ఉన్న ప్రతినిధులు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి హాజరవుతు న్న ప్రముఖుల మధ్య చర్చ ముఖాముఖి కార్యక్రమాలు ఉంటాయని ఆయన ఆహ్వా నంలో పేర్కొన్నారు .జీవి శ్యాంప్రసాద్ లాల్ కు పొన్నం రవిచంద్ర కు అమెరికా ఆట ఆహ్వానం రావడం పట్ల కరీంనగర్ ఫిలిం సొసైటీ సభ్యులు ఎస్పీఎఫ్ ట్రస్ట్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

: జిల్లా కలెక్టర్ డా.సత్య శారద మంగళవారం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, పారిశుధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ధర్మరాజ్, ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనసూర్య, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యాలను అధిగమించాలి

**నిర్మాణాల వేగం పెంపునకు ఎమ్మెల్యే కవ్వంపల్లి ఆదేశం**

**తిమ్మాపూర్, జూన్ 30 (తెలంగాణ వాణి)**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇంటి పథకం లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు వీలుగా నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ,గృహనిర్మాణ సంస్థ అధికారులతో నిర్వహించిన నియోజక వర్గస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, బిల్లుల చెల్లింపులు,ఇళ్ల మంజూరైనప్పటికీ నిర్మాణాలు చేపట్టని వారి వివరాలు,అందుకు గల కారణాలు వంటి తదితర అంశాలపై ఎమ్మెల్యే సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని విజయవంతం చేయడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని,ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడమే కాకుండా వాటిని అధిగమించేలా క్షేత్రస్థాయిలో ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని ఆయన సూచించారు.ఇసుక, సిమెంట్,ఇతర నిర్మాణ సామగ్రి కొరత లేకుండా చూడాలన్నారు. లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో చెల్లించి,నిర్మాణం ఎక్కడా ఆగకుండా చర్యలు తీసుకోవాలి”అని స్పష్టం చేశారు.కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు సమన్వయంతో పని చేసి,లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్లను వెంటనే గ్రౌండింగి చేయాలని ఆయన కోరారు. వివిధ స్థాయిలలో ఉన్న ఇళ్లను తదుపరి దశకు తీసుకెళ్లాలేలా చూడాలన్నారు. లబ్ధిదారులకు సాంకేతిక సూచనలు అందించడంతో పాటు నిర్మాణ సామగ్రి లభ్యత,నిధుల విడుదల, పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు



పర్యవేక్షణ కొనసాగించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రతి గ్రామంలో నిర్మాణాల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ నిర్ణీత గడువులోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు వీవీ వరలక్ష్మి (మానకొండూర్), పి.అనిత (శంకరపట్నం), ఎన్.ఆర్. మల్హోత్ర(తిమ్మాపూర్),ఏ.శ్రీనివాస్ రెడ్డి (గన్నేరువరం),కె.ప్రవీణ్ (బెజ్జంకి), వై.శశికళ(ఇల్లంతకుంట),హౌసింగ్ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు పి.శ్రీలత, ముజాఫరుద్దీన్,అధికారులు టీఆర్ ప్రవీణ్ కుమార్, ఎస్.వెంకటరమణ, ఏ.కృష్ణప్రసాద్,ఆర్ అజయ్ కుమార్,ఊర్మిళ,ఖాజా ముజహీర్ అలీ, ఏ.మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



# అప్లికేషన్ చార్జ్ రూ.80లు వసూలు మాత్రం రూ.100లు

**ముక్కు పిండి అదనపు వసూలు చేస్తున్న వైనం.**

**రశీదు అడిగితే కాగిత రహిత సమాజం**

**శంకరపట్నం జూన్ 30 (తెలంగాణ వాణి)**
మండల కేంద్రం మీసేవ కేంద్రంలో అక్రమ వసూళ్లు అడ్డగోలుగా సాగుతున్నాయి.రసీదు అడిగితే ఇటీవల మీసేవ గైడ్ లైన్స్ ప్రకారంగా 'కాగిత రహిత సమాజం' క్రింద రశీదులు ఇవ్వబడవు,చీటీ మీద ఆన్లైన్ నంబర్ మాత్రమే రాసిస్తాము.మీ మొబైల్ కి మీరు చెల్లించిన రూ.80 ల ఆన్లైన్ ట్రాన్సాక్షన్ మెసేజ్ వస్తుంది అని చెబుతున్నారు. మెసేజ్ చూశాక రూ.80లు కానీ వసూలు రూ.100 లు. అదనపు రూ.20 ల మాట ఏమిటని అడిగితే పేపర్ స్కానింగ్ చార్జీలట.మీసేవ ఉన్నతాధికారులే తీసుకోవా లని చెప్పారట.గతంలో ఎప్పుడూ స్కానింగ్ చార్జీలను పేర్కొనలేదు.అవి అప్లికేషన్ చార్జీలోనే ఉండేవి ఇప్పుడు కొత్తగా ఇదో పేరుతో నిర్వాహ కులు అదనపు దోపిడీకి పాల్పడుతున్నారని,అప్లికే షన్ చార్జీలలో పేపర్ స్కానిం గ్ కలుపుకొని ఉండదా? అన్నది వినియోగదారుల ప్రశ్న. మీసేవ నిర్వాహకులలో కొందరైతే అధికారులతో సన్నిహితంగా వెళుతూ, మచ్చిక చేసుకుంటూ అధిక సంపాదనకు తెర లేపారని కొన్నాళ్ల నుండి టాక్. అధికారులు ఎవరొచ్చినా వారికి దాసోహమే.అంతా నిర్వాహకుల సాగుదల దరఖాస్తుదారుడు తాను అప్లికేషన్ బయట కొనుక్కొని, కావలసిన డాక్యుమెంట్లను జిరాక్స్ తీసుకొని పోయిన ప్పటికీ అసలు చార్జీ కన్నా కొసరు వడ్డించి రూ.100లు ముక్కు పిండి వసూలు చేస్తున్నారని వినియోగదారు లు తమగోడుని వెల్లబోశారు. ఇదే విషయమై కొందరు మీసేవ ఆపరేటర్లను సంప్రదిస్తే పరిహాసంగా అప్లికేషన్ చార్జ్, డాక్యుమెంట్ జిరాక్స్ ఇలా కలుపుకొని రూ.100 అని చెబుతూనే అవి లేకపోయినా రూ.100లే ఛార్జ్ అని సమా ధానం.ఈ అదనపు వసూళ్ల ను టేక్ ఇట్ ఈజీగా రూ. 20లే గా అని తీసేస్తున్నారు. ఏమైనా రూ.100,రూ.200 లు తీసుకుంటున్నామా? అని ఎగతాళి సమాధానం.అయి తే తాము ఇలాంటి రూ.20 ఒక్కరి దగ్గరే తీసుకుంటున్నా మని అనుకుంటూ ఒక రోజులో తాము చేసే అప్లికేషన్లు కనీసం ఓ 20 చేసినా తమకి అదనపు సంపాదన అప్పనంగా రూ. 400 మిగులుతున్నాయని విషయం మరుస్తున్నారేమో. ఇంకా ఎక్కువ ప్రశ్నిస్తే, వివరణను కోరుతుంటే నీవేం చేసుకుంటావో చేసుకో పో అని సవాల్ విసురుతున్నా రని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.ఆ రూ.20లు ఒక్కొక్కరికి ఎంత భారమో భరించే వాడికే తెలుస్తుంది.ఈ అధిక వసూళ్ల వెనక అధికారుల ఉదాసీనత పై మర్మం ఏమిటో తెలియ దు.అదనపు దోపిడీలో అధికారులకు ఎంత ?నిర్వాహకులకెంత? తమదైన శైలిలో జీవితాన్ని గడపాలన్న అత్యాశతో వినియోగదారుల నెత్తిపై పెను భారం మోపుతున్నారు.తమ జీవితాలను ఆనందంగా గడుపుతూ అందమైన లోకాలలో విహరిస్తూ,అందలాల అధిరోహణకు,ఆస్తుల సముపార్జనకు సాధారణ, మధ్యతరగతి కుటుంబీకులను బలి తీసుకుంటున్నారని.వీరి ఆగడాలకు అంతముండదా? అధికారులు అడ్డుకట్ట వేయలేరా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.బయట అప్లికేషన్ కొనుక్కొని, డాక్యుమెంట్లను జిరాక్స్ తీయించుకొని వెళితే వారి సెంటర్లో అప్లికేషన్ చేయడం లేదని కొందరి ఆరోపణ. వీరి అక్రమాలకు ఒకరినొకరు తోడుగా ఉండాలి మనమంతా ఐక్యం కావాలని అసోసియేషన్ ఏర్పాటు కూడా చేసుకున్నారు.నోరు కుట్టుకొని,కడుపు కట్టుకొని ఎండా,వాన,చలి అని చూడక బ్రతుకుదెరువు కోసం... కూలి, కైకిలి, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ చాలీచాలని ఆర్థిక సంపాదనతో నాన తంటాలు పడి పోగు చేసుకుంటూ వారి పిల్లల చదువుల కోసం, ఇతరత్రా అవసరాల కోసం అవసరమయ్యే సర్టిఫికెట్లకు అప్లికేషన్ కు పోయిన వారి దగ్గర దోచుకోవడం ఎంత అన్యాయమని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.దీనిపై జిల్లా కలెక్టర్, జిల్లా మీసేవ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని లేనియెడల రాష్ట్ర ఉన్నతాదికారులకు ఫిర్యాదు చేస్తామని, ఆధారాలతో వినియోగదారుల కోర్టును ఆశ్రయిస్తామని వినియోగదారులు హెచ్చరించారు.

# సుదీర్ఘ సేవలకు ముగింపు

**హిందీ పండిత్ తీగల సత్యనారాయణకు ఘన వీడ్కోలు**

**వేములవాడ, జూన్ 30 (తెలంగాణ వాణి)**
వేముల వాడ మున్సిపల్ పరిధిలోని శాస్త్రాజ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ పండిత్‌గా సేవలందించిన తీగల సత్యనారాయణ ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాల ఆవరణలో మంగళ వారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు,విద్యార్థు లు,చిన్ననాటి మిత్రులు మాట్లాడుతూ,తీగల సత్య నారాయణ తన సుదీర్ఘ సేవా కాలంలో క్రమశిక్షణ,నిజా యితీ,అంకితభావంతో విద్యార్థులకు విద్యాబోధన చేసి ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన ఆదర్శ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందారని కొనియా డారు.విద్యార్థుల్లో విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ పెంపొందించడంలో ఆయన చేసిన కృషి చిరస్మర ణీయమని అన్నారు. అనంతరం ఆయనను శాలు వాతో సత్కరించి,పుష్పగు చ్ఛం,జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు,గ్రామస్థులు ఆకాంక్షించారు.ఈ కార్యక్ర మంలో



పాఠశాల ప్రధానో పాధ్యాయులు శ్రీనివాస్, సహచర ఉపాధ్యాయులు, కౌన్సిలర్లు ఏనుగు జ్యోతి, ఎలా శ్రీనివాస్,మైలారం శ్రీనివాస్,బాల్య మిత్రులు ఎల్లాల ఆనంద రెడ్డి,తాహేర్ పాషా,మోటురీ మల్లేశం, దుర్గం పరశురాం,కొలిపాక శ్రీనివాస్,లాయక్ పాషా, విద్యార్థులు,పూర్వ విద్యార్థు లు,తల్లిదండ్రులు పాల్గొ న్నారు.

## పదవీ విరమణ పొందిన ఐదుగురు పోలీసు అధికారులకు ఘన వీడ్కోలు

**కొత్తగూడెం, జూన్ 30 (తెలంగాణ వాణి)**
జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన ఐదుగురు పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఘనంగా సన్మానించారు. 37 సంవత్సరాల సేవా కాలాన్ని పూర్తి చేసిన మల్లెంపాటి తిరుమలరావు, పెయ్యాల ప్రసాద్, సాలి పాపయ్యతో పాటు 36 సంవత్సరాలు సేవలందించిన మట్టూరి సత్యనారాయణ, కుప్పా వెంకట విశాల్ కుమార్ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఎస్పీ వారికి శాలువాలు కప్పి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, దీర్ఘకాలం పాటు నిబద్ధతతో సేవలందించిన అధికారులు కొత్త తరానికి ఆదర్శమని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. అలాగే పదవీ విరమణ పొందిన సిబ్బందికి జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్య నాయక్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐలు సుధాకర్, లాల్ బాబు, కృష్ణారావు, పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు, సిబ్బంది, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
బుధవారం । 1 । జూలై । 2026

# కబీర్ కోహినూర్ సమ్మాన్ అందుకున్న విద్యాసాగర్ జామి ప్రసాదరావు



**మందమర్రి, జూన్ 30 (తెలంగాణ వాణి విలేకరి)**

పట్టణంలో ని కళ్యాణిఖణి సింగరేణి కాలరీస్ పాఠశా లలో సీనియర్ హిందీ పండితులుగా విధులు నిర్వహిస్తున్న విద్యాసాగర్ జామి ప్రసాదరావు ప్రతి ష్టాత్మక జాతీయ పురస్కారం "కబీర్ కోహినూర్ సమ్మాన్" అందుకున్నారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెంది న అఖిల్ భారతీయ కబీర్ మఠం, సద్గురు కబీర్ ఆశ్రమ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 629వ కబీర్ జయంతి మహోత్సవాల్లో భాగంగా ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. జూన్ 28, 29 తేదీల్లో ఘనంగా జరిగిన ఈ వేడుకల్లో హిందీ భాషా, సాహిత్య రంగాలకు విశేష సేవలు అందించినందుకు గాను విద్యాసాగర్ జామి ప్రసా దరావును ఈ జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.ఇది ఆయన అందుకున్న ఐదవ జాతీ య స్థాయి పురస్కారం కావడం విశేషం. హిందీ సాహిత్యాభివృద్ధికి ఆయ న చేసిన కృషిని గుర్తిస్తూ "కబీర్ కోహినూర్ సమ్మా న్"తో సత్కరించారు.అదేవిధంగా కబీర్ మహో త్సవ కార్యక్రమంలో విద్యా, సామాజిక అభివృ ద్ధికి దోహదపడేలా విద్యా సాగర్ జామి ప్రసాదరావు సంపాదకత్వంలో వెలువ డిన పలు గ్రంథాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన విద్యావేత్తలు, సాహితీవేత్తలు, కవులు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ అవార్డు అందుకోవడం పట్ల విద్యాసాగర్ జామి ప్రసాదరావు ఆనందం వ్యక్తం చేస్తూ, హిందీ భాషా సాహిత్య సేవలో మరింత అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

# సాయిబాబా మోడల్ పాఠశాలకు విరాళం అందించిన బిఆర్ఎస్ నాయకులు

**కోతుల బెడద నుండి సంరక్షణ కోసం ఇనుప గ్రిల్స్ ఫిట్టింగ్**





**నాగిరెడ్డిపేట మండలం జూన్ 30 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

నాగిరెడ్డి పేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో కోతుల ద్వారా పాఠశాలలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలుసుకున్న బిఆర్ఎస్ మండల నాయకులు పేరుపల్లి సాయిబాబా తనవంతుగా 50వేల రూపాయలు పాఠశాలకు విరాళంగా అందించారు . గత కొంతకాలం నుండి పాఠశాలలో కిటికీల నుండి గదులలోకి తరచూ చొరబడి పాఠశాలల విద్యార్థులకు ఇబ్బంది కలిగిస్తు అలాగే , రాత్రి సమయంలో గందరగోళంగా మారుస్తున్నాయని తెలుసుకున్నారు. కిటికీ గ్రిల్స్ మధ్యనుండి గదిలోకి ప్రవేశించకుండా ఉండడానికి, ప్రతి కిటికీ కి ఇనుప గ్రిల్స్ అమలు చేయడం జరిగింది . ఈ పని పూర్తి చేయడానికి సుమారుగా 50 వేల రూపాయల వరకు ఖర్చు వస్తుందన్నారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుల కోరిక మేరకు పేరుపల్లి సాయిబాబా ఈ ఖర్చును భరించడానికి 50వేల రూపాయలను పాఠశాల కోసం విరాళం ఇవ్వడానికి అంగీకరించారు . ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ సాయిబాబా విరాళం విద్యా పురోగతికి ఎంతగానో దువత పడుతుంది . ఈ చర్య పాఠశాల విలలో ఎలాంటి ఆటంకాలు లేని వాతావరణానికి పాఠశాల సమయంలో వచ్చిన తర్వాత సామాగ్రి భద్రతకు మంచి మార్గం అని కొనియాడారు . ఇట్టి కార్యక్రమంలో గోపాల్పేట్ తెలంగాణ మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్ ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులు సాయిబాబాకు కృతజ్ఞతలు తెలిపారు . ఇలాగే దాతలు ముందుకు వచ్చి మరిన్ని అభివృద్ధి పనులు చేయాలని కోరారు.

# పాఠశాల విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్ పంపిణీ





**నకిరేకల్ : జూన్ 30 (తెలంగాణ వాణి)**

నకిరేకల్ ప్రముఖ వ్యాపారవేత్త శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ గజ్జల సూర్య ప్రకాష్ సహకారంతో ఓగోడు ప్రభుత్వ పాఠశాలలో చదివే 50 మంది విద్యార్థులకు నకిరేకల్ లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్ ఆధ్వర్యంలో స్టీల్ వాటర్ బాటిల్స్ మంగళవారం పంపిణీ చేయడం జరిగింది. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ వాడటం వల్ల ప్లాస్టిక్ చూసుకుని రేణువులు పిల్లలకి శరీరంలోకి ప్రవేశించి అనేక రోగాల బారిన పడుతున్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నివారించేందుకు పిల్లలకు స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వీర్లపాటి పద్మ , క్లబ్ కార్యదర్శి సూర్యచంద్రరావు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలి

**ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటైన విద్య అందించాలి**

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలి**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**





**నిర్మల్, జూన్ 30 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం లోకేశ్వరం మండలంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రభుత్వ ఆసుపత్రి, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), రైతు వేదికలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియతో పాటు ఆయిల్ పామ్ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోజువారీ ఓపీ వివరాలు, మందుల లభ్యత, మౌలిక వసతులపై ఆరా తీశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన రోగులను ఉన్నత స్థాయి ఆసుపత్రులకు వెంటనే రిఫర్ చేయాలని సూచించారు. చికిత్స కోసం వచ్చే ప్రతి రోగికి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రి రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.అనంతరం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) సందర్శించిన కలెక్టర్, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా నాణ్యమైన విద్య అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో అభ్యాస నైపుణ్యాలు, సృజనాత్మకత, చదువుపై ఆసక్తి పెంపొందేలా వినూత్న బోధనా విధానాలు అమలు చేయాలని సూచించారు. పలువురు విద్యార్థులతో మమేకమై వారి విద్యా ప్రగతిని స్వయంగా పరిశీలించారు. అనంతరం మండల రైతు వేదికలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను సమీక్షించారు. మండలంలోని మొత్తం రైతుల సంఖ్య, పూర్తయిన నమోదు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇంకా నమోదు చేసుకోని రైతులను గుర్తించి వారితో వ్యక్తిగతంగా సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రీని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని సూచించారు.అనంతరం స్థానిక రైతు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను సందర్శించి పంట సాగు విధానం, దిగుబడి, మార్కెట్ అవకాశాలపై రైతుతో చర్చించారు. భవిష్యత్‌లో అధిక ఆదాయాన్ని అందించే ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు.ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి రాజేందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, తహసీల్దార్ సూర్యారావు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపాల్టీ కార్మికులంటే అంత చులకనెందుకు?



**మందమర్రి జూన్ 30 (తెలంగాణ వాణి విలేకరి)**

కోవిడ్ ను లెక్క చేయకుం డా కరోనా కష్ట కాలంలో తమ ప్రాణాలను లెక్క చేయకుండా పనిచేసి ప్రజల ప్రాణాలను కాపా డిన మున్సిపల్ కార్మికు లకు విలువలేదా?మున్సి పల్ కార్మికులంటే ప్రభు త్వానికి అంత చులక నేందుకని సి ఐ టి యి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంకెరవి ప్రశ్నించారు. రాజ్యాంగం కార్మికుల కిచ్చిన ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు చెయ్యాలని, 60 సం. రాలు నిండి మరణించిన వారి స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని,కనీస వేతనం రూ:26000/అమలు చేయాలని డిమాండ్ చేస్తు మంగళవారం మున్సిపల్ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులు సిఐ టి యు ఆధ్వర్యం లో మున్సిపల్ కమిషనర్ రాజలింగుకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సంకె రవి దూలం శ్రీనివాస్ సి ఐ టి యు జిల్లా ప్రధాన కార్య దర్శి మాట్లాడుతూ.అనేక సం రాలుగా వివిధ విభాగల్లో పని చేస్తున్న కార్మికులకు రాజ్యాంగంలో పొందు పర్చిన హక్కులను ప్రభుత్వాలు కార్మికులకు అమలు జరప కపోవడం చూస్తుంటే రాజ్యాంగాన్ని అవమాన పరచడమేనని అన్నారు. మరణించిన, 60 సం.రా లు నిండినవారి స్థానంలో కుటుంబ సభ్యులకిచ్చే ఉద్యోగ హక్కును కూడ నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడం శోచనీయమని అన్నారు.ప్రభుత్వం పున రాలోచన చేసుకొని గత సం కాలంలో 60 సం. రాల వయస్సు నిండి మరణించిన వారి స్థానం లో వారి కుటుంబ సభ్యు లకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.అదే విదంగా కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చెయ్యాలని, ప్రతి కార్మికుడికి ఇన్సూరెన్స్ చేయించాలని పెం డింగ్ లో ఉన్న బట్టలు, చెప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కోలా వాసు మున్సిపల్ సి ఐ టి యు నాయకులు చెన్న రాజం, చెన్న రాజమొగి లి, చిప్పకుర్తి గట్టయ్య, మేడపట్ల నర్సయ్య,, అవునూరి లత, వెంక మ్మ,లింగంపల్లి రవి, పొన్న లక్ష్మణ్,సంగి రాజలింగు, ఆవునూరి మృగరాజు కార్మికులు పాల్గొన్నారు.

# రైతు భరోసా నిధుల విడుదల

**వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



**పెద్దపల్లి, జూన్ 30 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**

తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రైతు భరోసా పథకం కింద నిధులను విడుదల చేసిన సందర్భంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లి రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతుల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని అన్నారు. రైతు భరోసా నిధులు రైతులకు సాగు ఖర్చుల్లో ఎంతో తోడ్పాటును అందిస్తాయని, ప్రతి అర్హ రైతుకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.అనంతరం రైతులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వ్యవసాయ అధికారి (ఏవో), వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ), ప్రజాప్రతినిధులు, రైతులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సమాజ సేవకులుగా మారితే మహనీయుల ఆశయాలను నెరవేర్చినట్లే

**- ఎస్సీ ఎస్టీ బీసీ ఓబీసీ మైనారిటీ ఫోరం**

**జాతీయ అధ్యక్షులు జెట్టి ధర్మరాజు**



**వనపర్తి జూన్ 30, (తెలంగాణ వాణి ప్రతినిధి)**

మహనీయులు భౌతికంగా లేకున్నా వారి ఆశయాలు సజీవంగా ఉండాలంటే సమాజ సేవకులుగా మారాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, మైనారిటీ ఫోరం జాతీయ అధ్యక్షులు జెట్టి ధర్మరాజు అన్నారు. వనపర్తి జిల్లా గోపాల్ పేట మండల కేంద్రం ఫంక్షన్ హాల్‌లో మంగళవారం బచ్చలి కూర పరమేశ్వర్ మాదిగ పదవి విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవ జీవితం శాశ్వతం కాదని, వారు ఎంచుకున్న మార్గాలు, ఆశయాలు మాత్రమే సజీవంగా సమాజంలో జీవిస్తాయని మహనీయులు అంబేద్కర్, పూలే, మహేంద్ర నాథ్, మల్లు అనంత రాములు ఆశయాల సాధనకు అందరం కృషి చేద్దామన్నారు. పుట్టిన మానవుడు గిట్టగా తప్పదని, అలాగే ప్రతి ఉద్యోగి పదవి విరమణ తప్పక చేపట్టాల్సిందేనని ఆయన గుర్తు చేశారు. అంబేద్కర్ రిజర్వేషన్లు సృష్టించారంటే కేవలం దళితులకు, ట్రైబల్స్ కు మాత్రమే కాదని, సబండవర్గాలను దృష్టిలో ఉంచుకొని సమాజ హితం కోసమే అంబేద్కర్ రిజర్వేషన్లను అందించారని ధర్మరాజు గుర్తు చేశారు. ఉద్యోగులైన, రాజకీయ నాయకులైన వారి పదవుల్లో ఉన్నప్పుడు వారి వారి కుటుంబాలకే పరిమితం కాకుండా సమాజం కోసం తప్పించాలని, అలాంటి వారిలో బచ్చలకూర పరమేశ్వర్ ముందుంటారని, అటు ఉద్యోగ బాధ్యతలు, ఇటు సమాజం లోని పీడితుల కోసం నిర్విరామంగా కృషి చేయడం బచ్చలి కూర పరమేశ్వర్ ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. అందుకే సబండవర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై పరమేశ్వర్ దంపతులను, కుటుంబాన్ని ఆశీర్వదించడం హర్షనీయమన్నారు. పదవి విరమణ అనంతరం పరమేశ్వర్ పూర్తిస్థాయిలో సమాజంలోని పీడిత వర్గాల ఉన్నతి కోసం పని చేయాలని ఆకాంక్షించారు. ఈ పదవీ విరమణ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్, కొమ్ము రాములు, గంధం గట్టయ్య, గాయకులు రాజారాం ప్రకాష్, గంధం నాగరాజు, గంధం పరాజ్యోతి, గంధం భాస్కర్, తాడిపర్తి శాంతయ్య, కేటీ బెంజమిన్, వినోద్ పాల్గొన్నారు.

# విద్యాకుసుమం గుర్రం దేవదాస్‌కి ఘన వీడ్కోలు

**37 ఏళ్ల నిరుపమాన సేవలకు ముగింపు**



**టేకులపల్లి, జూన్ 30 (తెలంగాణ వాణి)**

సులానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘకాలం పాటు ప్రధానోపాధ్యాయులుగా సేవలందించిన గుర్రం దేవదాస్ (జి.హెచ్.ఎం) మంగళవారం (30-06-2026) నాడు ఉద్యోగ విరమణ చేశారు. విద్యాశాఖలో ఏకంగా 37 సంవత్సరాల పాటు అలుపెరగని యోధునిలా నిరుపమాన సేవలు అందించి,అందులోనూ సులానగర్ పాఠశాలలోనే 14 సంవత్సరాల పాటు హెచ్ఎంగా బాధ్యతలు నిర్వహించిన ఆయన పదవీ విరమణ సన్మాన మహోత్సవం పాఠశాల ప్రాంగణంలో అత్యంత వైభవంగా జరిగింది. స్నేహశీలి, సహృదయులు, అపార విద్యానుభవ కర్త అయిన దేవదాస్ ని వీడ్కోలు పలికేందుకు విద్యాశాఖ అధికారులు,ప్రజాప్రతినిధులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, గ్రామస్థులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.ఈ వీడ్కోలు సన్మాన కార్యక్రమం ప్రారంభానికి ముందు ఇల్లెందు శాసనసభ్యులు (ఎమ్మెల్యే)కోరం కనకయ్య ప్రత్యేకంగా విచ్చేసి గుర్రం దేవదాస్‌కి హృదయపూర్వక పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యా రంగంలో దేవదాస్ అందించిన సేవలను కొనియాడి, ఆయన విశ్రాంత జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించి వెళ్లారు. అనంతరం సభాధ్యక్షులు లక్ష్మయ్య అధ్యక్షతన ప్రధాన సన్మాన సభ అత్యంత ఉత్సాహ భరితంగా సాగింది.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ సంఘాల నేతలు ఆయనను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి భావోద్వేగ భరితంగా వీడ్కోలు పలికారు.ఈ మహోత్సవంలో సులానగర్ గ్రామ సర్పంచ్ లక్ష్మ నాయక్ , గెజిటెడ్ హెచ్ఎం జిల్లా ప్రెసిడెంట్ బాలాజీ, లక్ష్మీదేవి పల్లి ఎంఈఓ కృష్ణయ్య , టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఇస్లావత్ లక్ష్మణ్ , యుటిఎఫ్ రాష్ట్ర బాధ్యులు కిషోర్ సింగ్ పాల్గొని ప్రసంగించారు. అలాగే పిఆర్టియు జిల్లా అధ్యక్షులు నరసయ్య , టి టి ఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు , టి పి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు హరిలాల్ , పి ఆర్ టి యు అసోసియేట్ అధ్యక్షులు టి. రవీందర్ , వివిధ పాఠశాలల హెచ్ఎంలు రాంచందర్ సింగ్ (ముత్యాలంపాడు), రవి (కుంటాల), మంగీలాల్ (టేకులపల్లి బొమ్మనపల్లి), తారా సింగ్ (బేతంపూడి), రిటైర్డ్ ఎంఈఓ స్వామి దాసు , పిల్లి శ్రీనివాస్ , ఉపసర్పంచ్ చెన్నై, గ్రామ ప్రముఖులు ఉండేటి బసవయ్య , సులానగర్ పాఠశాల కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఉపాధి శిక్షణవిద్యా సౌకర్యాలపై ఎమ్మెల్యే జారె ఆకస్మిక తనిఖీ



**అశ్వారావుపేట, జూన్ 30 (తెలంగాణ వాణి):**

అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మంగళవారం నియోజకవర్గ కేంద్రంలో విస్తృతంగా పర్యటించి, త్వరలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ భద్రాచలంఆధ్వర్యంలో నిర్వహిం చనున్న ఉచిత ఉపాధిఉద్యోగ శిక్షణ కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలించారు. యువతకు నాణ్యమైన శిక్షణ అందించి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు ఉత్తమ ఫలి తాలు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచిం చారు. కళాశాల, హాస్టల్‌లోని సమస్యలు మరియు మౌలిక వసతు లపై ఆరా తీసిన ఎమ్మెల్యే, అవసరమైన నిధులు కేటాయించి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్య, యువత ఉపాధి, ప్రజా సంక్షేమ కార్యక్ర మాలు ప్రతి అర్హుడికి చేరేలా నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana



# ఓటర్ల నమోదులో జాగ్రత్తలు పాటించాలి : మాజీ మంత్రి వనమా

పాల్వంచ, జూన్ 30 (తెలంగాణ వాణి)



పాత పాల్వంచలో జరుగుతున్న ఓటర్ల నమోదు ఎన్యుమరేషన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా బీఎల్ఏలు, బీఎల్ఓలు అనుసరించాల్సిన జాగ్రత్తలపై మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు పలు సూచనలు చేశారు. మంగళవారం పాత పాల్వంచ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల ప్రవీణ్ కుమార్ మాజీ మంత్రి వనమాను మర్యాదపూర్వకంగా కలిసి ఓటర్ నమోదు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువై నదని, ఓటు ప్రజల నైతిక హక్కు అని పేర్కొన్నారు. అర్హులైన ప్రజలందరూ బాధ్యతగా ఓటర్ నమోదు పత్రాలను నింపి, తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్క బీఎల్ఏ చురుకుగా పాల్గొని ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. 47వ డివిజన్ పరిధిలోని 79, 80 పోలింగ్ బూత్‌లలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ ఇంచార్జ్ మిర్యాల అలివేలు, బూత్ స్థాయి అధికారులు, పార్టీ సమన్వయకర్త ఏనుగుల శ్రీను, బీఎల్ఏలు మిరియాల వెంకటేశ్వర్లు, వాసు మల్ల గౌతమ్, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు మాదిరాజు సంతోష్, కంచర్ల రామారావు, యాదయ్య, పోరండ్ల విజయలక్ష్మి మరియు వివిధ పార్టీలకు సంబంధించిన బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇండ్ల సమస్యపై 1న చలో కలెక్టరేట్

## ఇండ్లు లేని పట్టణ పేదలు దండుగా కదలిరావాలి

## పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య




కొత్తగూడెం, జూన్ 30 (తెలంగాణ వాణి)

ఇండ్లు లేని నిరుపేదలు అందరికీ తక్షణమే ఇండ్ల స్థలాలు కేటాయించాలని, పేదల ఇండ్ల సమస్యల పరిష్కారం కోసం జులై 1న నిర్వహించే కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో సిపిఐ కొత్తగూడెం పట్టణ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని నిరుపేదలు నిర్మించుకున్న ఇండ్లకు వెంటనే ఇంటి నెంబర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పేదల ఇండ్ల అక్రమ కూల్చివేతలను పాలకులు, అధికారులు తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ ప్రధాన డిమాండ్ల సాధనకై సిపిఐ, సిపిఎం, న్యూ డెమోక్రసీ, మాస్ లైన్ పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా ఉంటుందని వెల్లడించారు. ఈ పోరాటంలో ఇండ్లు లేని పట్టణ పేదలందరూ దండుగా కదలివచ్చి ధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు. పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని, నిరుపేదల హక్కుల సాధన కోసం ఎంతటి త్యాగాలకైనా సిద్ధమని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు, కార్పొరేటర్లు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, గోపి కృష్ణ, ఎండి యూసుఫ్, పిడుగు శ్రీనివాస్, గడ్డం ప్రభాకర్, ధర్మరాజు బోయిన విజయ్ కుమార్, పి సత్యనారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.

# 6వ బెటాలియన్‌లో ఘనంగా పదవీ విరమణ మహోత్సవం



లక్ష్మీదేవిపల్లి, జూన్ 30 (తెలంగాణ వాణి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చాతకొండలోని 6వ బెటాలియన్‌లో మంగళవారం పదవీ విరమణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. బెటాలియన్ కమాండెంట్ పి.సి.వి. రమణ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమాండెంట్ హెచ్. అబ్దుల్ రషీద్ ఆధ్వర్యంలో బెటాలియన్‌కు చెందిన ఆర్ఎస్ఐ యు. స్వామి రంగయ్య, ఏఆర్ఎస్ఐ ఈ. చాకో రాయ్ పదవీ విరమణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ అబ్దుల్ రషీద్ పదవీ విరమణ పొందిన అధికారులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు తమ విధుల్లో సేవలు అందించి, క్రమశిక్షణ, నిజాయితీ, అంకిత భావంతో విధులు నిర్వహించి బెటాలియన్‌కు, పోలీస్ వ్యవస్థకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకువచ్చారని కొనియాడారు. ఉద్యోగ జీవితం ముగిసినప్పటికీ సమాజానికి తమ అనుభవాలను అందిస్తూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ పొందిన అధికారులు తమ సేవా కాలంలో సహకరించిన ఉన్నతాధికారులు, సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం బెటాలియన్ అధికారులు, సిబ్బంది వారికి శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు కె. శంకర్, బి. మరియ దాసు, ఏఓ సత్యవతి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది మరియు మినిస్ట్రీయల్ స్టాఫ్ పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

## పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల

పాల్వంచ, జూన్ 30 (తెలంగాణ వాణి)



రైతు సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని పాల్వంచ కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. రైతు భరోసా పథకం కింద మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా రూ 9 వేల కోట్ల ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు . ఈ సందర్భంగా పాల్వంచ మండలం పరిధిలోని జగన్నాధపురం గ్రామంలోని రైతు వేదికలో జరిగిన రైతు భరోసా లైవ్ టెలికాస్ట్ లో కొత్వాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ రూ 9,వేల కోట్లను తొమ్మిది రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతులకు రెండు లక్షల రుణమాఫీ, సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాకు రూ 500లు బోనస్, 5 లక్షల రైతు బీమా, 24 గంటల విద్యుత్ సరఫరా పథకాలు అందించిన ఘనత కాంగ్రెస్ కే దక్కిందన్నారు. రైతులకు ఎంతో మేలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అందరూ సహకారం అందించాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి పి. శంభోశంకర్, ఏ.ఈ.ఓ.లు వై.సత్యం, పవన్, విశాల, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొండ వెంకన్న గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గంగిరెడ్డి భువన సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# డమ్మీ అభ్యర్థితో పదో తరగతి పరీక్ష : ఇద్దరికి జైలు శిక్ష

కొత్తగూడెం, జూన్ 30 (తెలంగాణ వాణి)




పదో తరగతి పబ్లిక్ పరీక్షలో అసలు అభ్యర్థికి బదులుగా డమ్మీ అభ్యర్థితో పరీక్ష రాయించిన కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె. సాయి మంగళవారం తీర్పు వెలువరించారు. కేసు వివరాల ప్రకారం, 2019 నవంబర్ 4న నిర్వహించిన పదో తరగతి సోషల్ స్టడీస్ పబ్లిక్ పరీక్ష సందర్భంగా కొత్తగూడెంలోని లిటిల్ బర్డ్స్ పాఠశాలలో తనిఖీలు చేపట్టిన స్క్వాడ్ అధికారులు అక్రమాన్ని గుర్తించారు. అసలు అభ్యర్థి తెల్లం అనిల్ స్థానంలో పూనెం సందీప్ పరీక్ష రాస్తున్నట్లు తేలింది. హాల్ టికెట్‌ను పరిశీలించి అక్రమం జరిగినట్లు నిర్ధారించిన అనంతరం, పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కుసుమ శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి కొత్తగూడెం టౌన్ ఎస్సై పి. రామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాధారాలు, పత్రాలను పరిశీలించిన కోర్టు నిందితులపై అభియోగాలు రుజువయ్యాయని నిర్ధారించింది. దీంతో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ మాల్ ప్రాక్టీసెస్ అండ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టం, 1997లోని సెక్షన్ 8 కింద ముద్దాయిలకు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల చొప్పున జరిమానా విధించింది. అలాగే సెక్షన్ 419 ఐపీసీ కింద ఏడాది జైలు శిక్ష విధిస్తూ, రెండు శిక్షలను ఏకకాలంలో అనుభవించాలని తీర్పులో పేర్కొంది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నార్సింగ్ అనిల్ కుమార్ వాదనలు వినిపించగా, కోర్టు నోడల్ అధికారి ఎస్సై డి. రాఘవయ్య,డి.కామేశ్వరరావు సమన్వయం అందించారు.

# ఓటర్ల సర్వే నిబంధనలు సామాన్యులకు శాపం

## ఓటు హక్కును దూరం చేసే కుట్రలను అడ్డుకుంటాం2002 నాటి తల్లిదండ్రుల ఆధారాలు అడగడం అనాగరికం నిబంధనలు సడలించకుంటే ఉద్యమాలు: జాడి ఈశ్వర్ నేతకాని




ములుగు, జూన్ 30 (తెలంగాణ వాణి):

కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఓటర్ల సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సర్వేలో అమలు చేస్తున్న నిబంధనలు సామాన్య, పేద ప్రజల ఓటు హక్కును హరించే విధంగా ఉన్నాయని తెలంగాణ ఉద్యమకారుడు, సామాజిక కార్యకర్త జాడి ఈశ్వర్ నేతకాని ఆందోళన వ్యక్తం చేశారు. దొంగ ఓట్లు, బోగస్ ఓట్లను తొలగించే చర్యలను తాము స్వాగతిస్తున్నామని, అయితే ఆ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధంగా ఉండకూడదని ఆయన అన్నారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) 2002 తర్వాత ఓటు హక్కు పొందిన వారి వద్ద తల్లిదండ్రుల పాత ఓటరు గుర్తింపు కార్డులు, పూర్వ నియోజకవర్గాల వివరాలు, పాత పత్రాల జిరాక్స్ కాపీలు కోరుతున్నారని ఆయన పేర్కొన్నారు. దాదాపు 24 సంవత్సరాల క్రితం నాటి పత్రాలను సామాన్యులు, గిరిజనులు, దళితులు, వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రజలు భద్రపరచుకోవడం సాధ్యంకాదని అన్నారు. ఈ కాలంలో అనేక మంది తల్లిదండ్రులు మరణించారని, చాలామంది వలసలు వెళ్లి నివాసాలు మార్చుకున్నారని, అలాంటి పరిస్థితుల్లో పాత ఓటరు కార్డులు, వివరాలు సమర్పించాలని కోరడం ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు.

### మహిళలు, అనాథల పరిస్థితిపై ఆందోళన

ఇతర ప్రాంతాలు, పొరుగు రాష్ట్రాల నుంచి వివాహం చేసుకుని తెలంగాణకు వచ్చిన మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జాడి ఈశ్వర్ నేతకాని తెలిపారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన మహిళలు, చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన అనాథలు పాత ఆధారాలను ఎలా సమర్పిస్తారని ప్రశ్నించారు. అలాంటి వారి నుంచి 2002 నాటి పత్రాలు, తల్లిదండ్రుల ఓటరు వివరాలు కోరడం అన్యాయమని, పత్రాలు లేనట్లయితే ఓట్లు తొలగిస్తామని హెచ్చరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, మహిళలు, కూలీలు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన డిమాండ్లు2002 నాటి తల్లిదండ్రుల ఆధారాలు సమర్పించాలనే నిబంధనను వెంటనే రద్దు చేయాలి. ప్రస్తుతం నివాసాన్ని నిరూపించే ఆధార్ కార్డు, రేషన్ కార్డు, వివాహ ధృవీకరణ పత్రం వంటి పత్రాలను పరిగణనలోకి తీసుకోవాలి. అనాథలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళలు, వలస కార్మికులకు ప్రత్యేక మినహాయింపులు కల్పించాలి. క్షేత్రస్థాయిలో ప్రజలను భయాందోళనలకు గురిచేసే విధానాన్ని అధికారులు విరమించుకోవాలి. ప్రభుత్వం, ఎన్నికల సంఘం తక్షణమే స్పందించి నిబంధనలను సడలించకపోతే బాధితులను ఏకం చేసి నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తామని జాడి ఈశ్వర్ నేతకాని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును పరిరక్షించేందుకు ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని ఆయన స్పష్టం చేశారు.

# సింగరేణి అధికారుల పీఆర్పీ నిలుపుదలను వెంటనే ఎత్తివేయాలి

## - ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ డా . జనక్ ప్రసాద్






కొత్తగూడెం సింగరేణి, జూన్ 30 (తెలంగాణ వాణి)

సింగరేణి అధికారుల పీఆర్పీ నిలుపుదలను వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ డిమాండ్ చేశారు. కొత్తగూడెం కార్పొరేట్ హెడ్ ఆఫీస్ ముందు సీఎంఓఏఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షకు మంగళవారం ఆయన సంఘీభావం ప్రకటించి అధికారులకు పూర్తి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి అధికారుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం, సంస్థ యాజమాన్యం సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. అధికారుల పీఆర్పీ నిలుపుదల అంశాన్ని ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇటీవల సోమవారం ఈ అంశంపై సింగరేణి డైరెక్టర్లు, సీఎండీతో జరిగిన సమావేశంలో చర్చించినట్లు వెల్లడించారు. అధికారులకు పీఆర్పీ చెల్లించేందుకు ఎలాంటి సాంకేతిక లేదా పరిపాలనా ఇబ్బందులు లేవని, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని వారు అభిప్రాయపడినట్లు తెలిపారు. సింగరేణి అభివృద్ధిలో అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నందున, వారికి రావాల్సిన న్యాయమైన ప్రయోజనాలను ఆలస్యం చేయకుండా వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారుల సంఘం నాయకులు, ఐఎన్టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, జనరల్ సెక్రటరీ వికాస్, రీజినల్ జనరల్ సెక్రటరీ ఆల్బర్ట్, వైస్ ప్రెసిడెంట్లు పీతాంబరం, రజాక్, సెక్రటరీ అభిషేక్, శ్రీనివాస్, పోషం శ్రీనివాస్, మల్లారపు కొమురయ్య పాల్గొన్నారు.

# అధికారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

## ఎఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్

## అధికారుల రెండో రోజు నిరసన దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించిన ఎఐటీయూసీ నాయకులు






కొత్తగూడెం సింగరేణి, జూన్ 30 (తెలంగాణ వాణి)

సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం, ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని, వారి న్యాయపోరాటానికి ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. సింగరేణి అధికారుల సంఘం (సీఎంఓఏ) ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ఎదుట మంగళవారం నిర్వహించిన రెండో రోజు నిరసన దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాత్రింబవళ్లు శ్రమిస్తూ సింగరేణి సంస్థను లాభాల బాటలో నడిపిస్తున్న అధికారుల పట్ల యాజమాన్యం, ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరిని వీడి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. అధికారుల పే రివిజన్, అలవెన్సులు, పదోన్నతులు, ఇతర పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంస్థ లాభాల్లో అధికారులకు న్యాయమైన వాటా కల్పించడంతో పాటు మెరుగైన వైద్య సదుపాయాలు, సంక్షేమ ప్రయోజనాలు అందించడం యాజమాన్యం బాధ్యత అని పేర్కొన్నారు. అధికారుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం సంస్థ అభివృద్ధికే ప్రతికూలమని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే జోక్యం చేసుకుని అధికారుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శులు వి. మల్లికార్జున్ రావు, రమణమూర్తి, కత్తెర్ల రాములు, జె. గట్టయ్య, హుమాయూన్, కమల్, మధుకృష్ణ, మండల రాజేశ్వరరావు, సీఎంఓఏ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం ఏరియాలో క్వార్టర్స్ కేటాయింపునకు కౌన్సిలింగ్





కొత్తగూడెం, జూన్ 30 (తెలంగాణ వాణి)

సింగరేణి కొత్తగూడెం ఏరియాకు చెందిన ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగుల క్వార్టర్స్ కేటాయింపునకు సంబంధించిన కౌన్సిలింగ్ కార్యక్రమం మంగళవారం రుద్రంపూర్‌లోని ఆర్సీఓఏ క్లబ్‌లో సీనియారిటీ ప్రామాణికంగా నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్‌లో ఎన్‌సీ, ఎంసీ, ఎంహెచ్, సీ2, టీ2, ఎండీ క్వార్టర్స్ కేటాయింపు ప్రక్రియను యాజమాన్యం, కమిటీ సభ్యులు, యూనియన్ ప్రతినిధులు, సంబంధిత అధికారుల సమక్షంలో నిర్వహించారు. క్వార్టర్స్ కేటాయింపుకు సంబంధించిన విధానాలు, అర్హతలు, ప్రాధాన్యత క్రమం తదితర అంశాలను అధికారులు ఉద్యోగులకు వివరించారు. కొత్తగూడెం ఏరియాకు చెందిన మొత్తం 82 మంది ఉద్యోగులు కౌన్సిలింగ్‌కు నమోదు చేసుకోగా, వారిలో 23 మంది క్వార్టర్స్‌ను ఎంపిక చేసుకున్నారు. 40 మంది గైర్హాజరు కాగా, 19 మంది ఆసక్తి చూపలేదు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఎం. గోవిందరావు, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, డీజీఎం (ఈ,ఎం)క్రిస్టోఫర్,ఇన్‌చార్జ్ హెచ్‌ఓడీ (సివిల్) కె. రాజారాం, డీవైపీఎం జి.హరీష్, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ గట్టయ్య,ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# పుస్తకాల దందాపై శ్రీ చైతన్యకు షాక్.. స్కూల్‌లో గోడౌన్లు సీజ్



ఖమ్మం, జూన్ 30 (తెలంగాణ వాణి)

ఖమ్మం నగరంలోని మమతా రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య ఒలంపియాడ్ స్కూల్‌లో విద్యాశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, పాఠ్యపుస్తకాల రెండు గోడౌన్లను సీజ్ చేశారు. విద్యార్థి సంఘాల ఫిర్యాదు మేరకు అడిషనల్ కలెక్టర్, డీఈవో ఆదేశాలతో ఎంఈవో శైలజ ఆధ్వర్యంలో ఈ చర్యలు చేపట్టారు. పాఠశాల లోగోలతో కూడిన పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను అధిక ధరలకు విద్యార్థులకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ , తదితర విద్యార్థి సంఘాల నాయకులు స్కూల్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల ప్రాంగణంలోనే పుస్తకాల విక్రయాలు నిర్వహిస్తూ తల్లిదండ్రుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారని వారు ఆరోపించారు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా వ్యాపారం కొనసాగుతోందని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. అక్రమాలకు పాల్పడుతున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అధిక ధరలకు పుస్తకాల విక్రయాలను పూర్తిగా అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తనిఖీల అనంతరం అధికారులు రెండు పుస్తకాల గోడౌన్లను సీజ్ చేసి, సంబంధిత రికార్డులను స్వాధీనం చేసుకుని విచారణ ప్రారంభించారు. ఈ ఘటన ఖమ్మం నగరంలో చర్చనీయాంశంగా మారింది.

# బీసీ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి : ఏఐఎస్ఎఫ్



కొత్తగూడెం, జూన్ 30 (తెలంగాణ వాణి)

బీసీ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యార్థుల ఆరోగ్యాలపై ఉన్నత అధికారులు శ్రద్ధ వహించాలని ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ మేరకు శనివారం బీసీ సంక్షేమ ఉన్నతాధికారి విజయలక్ష్మికి పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి పక్షాన అందజేశారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం పునఃప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా వసతి గృహాల్లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా విద్యార్థులు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతి గృహాల్లో శానిటేషన్ చేపట్టాలని, దోమల బారి నుంచి కాపాడేందుకు హాస్టల్ కిటికీలు, మెస్ డోర్లు ఏర్పాటు చేసి దోమతెరలు ఇవ్వాలని కోరారు. ఏఎన్ఎంలను హాస్టళ్లకు విజిట్ చేయించాలని, వసతి గృహాల్లో పూర్తిస్థాయిలో వర్కర్లను నియమించి ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని అన్ని బీసీ సంక్షేమ వసతి గృహాలను ఉన్నతాధికారులు సందర్శించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షులు కోరిమి సంజయ్, జిల్లా సమితి సభ్యులు ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
బుధవారం । 1 । జూలై । 2026

# ప్రభుత్వ సంక్షేమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలపై అధికారులతో సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్**





ఖమ్మం, జూన్ 30 (తెలంగాణ వాణి)

సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల్లో విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంతో పాటు అన్ని మౌళిక సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, సంబంధిత ఆర్ సీఓ లతో హాస్టళ్ల నిర్వహణ, మౌళిక సదుపాయాలు, విద్యార్థుల సంక్షేమంపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హాస్టళ్లలో తాగునీరు, విద్యుత్, టాయిలెట్,డార్మెటరీ, ఫర్నిచర్, వంటశాల, డైనింగ్ హాల్, భద్రతా ఏర్పాట్లు తదితర సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని భవనాల స్థితిని పరిశీలించి, మరమ్మతులు అవసరమైన చోట వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. వసతి గృహాలను అధికారులు ఆకస్మిక తనిఖీ చేసి లోపాలను వెంటనే గుర్తించి, నివేదిక సమర్పించాలని, తదనుగుణంగా ఆయా సంక్షేమ అధికారులు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి ప్రభుత్వ విద్యాసంస్థకు జీరో విద్యుత్ బిల్లు వచ్చేలా విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కిచెన్, టాయిలెట్ వ్యర్థాలు, మురుగునీటి సమస్యలు తలెత్తకుండా ఇంకుడుగుంతల నిర్మాణాలు చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో పాఠశాలల పరిస్థితులను మెరుగ్గా తీర్చిదిద్దినట్లు, వసతిగృహాల మరమ్మతులకు నిధుల మంజూరికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ప్రతి సంక్షేమ శాఖ లో నియోజకవర్గానికి ఒకటి చొప్పున అధ్వాన్న స్థితిలో ఉన్న వసతి గృహాన్ని ఎంపికచేసి, పూర్తి స్థాయిలో తీర్చిదిద్దే విధంగా చర్యలకు నిధుల గురించి వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. వర్షాకాలం కావున అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డోర్లు, కిటికీలు వైర్ మెష్ ఏర్పాట్లు, టాయిలెట్లమరమ్మత్తులు, నీటి నిల్వ లేకుండా చర్యలు వెంటనే చేయాలన్నారు. ఆహారం విషయంలో జిల్లాలో ఎక్కడ ఫుడ్ పాయిజన్ సమస్య ఉత్పన్నం కావడానికి వీలులేదని, ఎక్కడైనా సంఘటన జరిగితే కఠినచర్యలు వుంటాయని కలెక్టర్ అన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు దగ్గరలోని వసతి గృహాలను మ్యాపింగ్ చేయాలన్నారు. వసతి గృహాల్లో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన తరువాత గ్రీవెన్స్ లలో అడ్మిషన్లు, బదిలీల కొరకు వచ్చిన దరఖాస్తులకు మిగులు సీట్లలో అవకాశం కల్పించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా బిసి, సాంఘిక సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ డిడి విజయలక్ష్మి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్, ఆయా శాఖల ఆర్ సీఓ లు, విద్యుత్ శాఖ ఏవో కె. శ్రీధర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పదవి విరమణ అనంతరం సమాజ సేవ చేయాలి

**- డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల**




పాల్వంచ, జూన్ 30 (తెలంగాణ వాణి)

ప్రభుత్వ ఉద్యోగులు తమ పదవీ విరమణ అనంతరం సమాజసేవ చేయాలని డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. గృహ నిర్మాణ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్ గా పనిచేసి పదవీ విరమణ పొందిన చుంచు రమేష్ బాబు పదవీ విరమణ సన్మాన మహోత్సవంలో కొత్వాల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల తో పాటు 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి లు రమేష్ బాబు, కుమారి దంపతులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ ఉద్యోగులు తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో పాటు సమాజసేవకు పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సవేరామ్, డివిజనల్ ఇంజనీర్ ఎస్.కే.సలీం, డేవిడ్, లాల్ సాబ్, రాము, రిటైర్డ్ ఉద్యోగులు, కొండం వెంకన్న గౌడ్, పాకాలపాటి రోశయ్య చౌదరి, జొన్నాడ కృష్ణ, శ్రీకాంత్, టి.వెంకటేశ్వర్లు, మున్సిపల్ మేనేజర్లు, లోగాని వెంకటసత్యనారాయణ, తంబాల ప్రసాద్, నాయకులు బూసి శ్రీను, వాలపల్లి రాంబాబు , తదితరులు పాల్గొన్నారు.

# రెండు పంచాయతీల ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం



లక్ష్మీదేవిపల్లి, జూన్ 30 (తెలంగాణ వాణి)

మండలపరిధిలోని లోతువాగు, ప్రశాంతి నగర్‌లో రెండు గ్రామ పంచాయతీల పాలక మండళ్ల ఆధ్వర్యంలో ఉచిత హోమియోపతి వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరంలో హైదరాబాద్ నుంచి వచ్చిన హోమియోపతి వైద్యుల బృందం ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లోతువాగు సర్పంచ్ ఈసం కళ్యాణి, ప్రశాంతి నగర్ సర్పంచ్ అజ్మీర లైలా ఆధ్వర్యంలో నిర్వాహిచారు. అలాగే రెండు పంచాయతీల పాలక మండలి సభ్యులు కార్యక్రమ నిర్వహణలో చురుకుగా పాల్గొని విజయవంతం చేశారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. నిపుణులైన హోమియోపతి వైద్యుల ద్వారా ఉచితంగా వైద్య సేవలు, మందులు అందించడంపై ప్రజలు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ శిబిరం విజయవంతంగా ముగియడం పట్ల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.

# ఘనంగా పోలీస్ అధికారుల పదవీ విరమణ వేడుకలు

**ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం**

**పదవీ విరమణ పొందిన అధికారుల సేవలను కొనియాడిన సీపీ**




కరీంనగర్, జూన్ 30 (తెలంగాణ వాణి):

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలం పాటు సేవలందించి మంగళవారం పదవీ విరమణ పొందిన ఏడుగురు పోలీస్ అధికారులకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై పదవీ విరమణ పొందిన అధికారులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ, పోలీస్ ఉద్యోగం సమాజ రక్షణకు అంకితమైన బాధ్యతాయుతమైన సేవ అని పేర్కొన్నారు. ప్రజల శాంతి భద్రతల కోసం తమ జీవితంలో అత్యధిక కాలాన్ని వెచ్చించి విజయవంతంగా పదవీ విరమణ పొందడం అభినందనీయమని అన్నారు. విధి నిర్వహణలో వారు ప్రదర్శించిన క్రమశిక్షణ, అంకితభావం, నిజాయితీ యువ పోలీస్ సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ పొందిన మహమ్మద్ ఇర్షాద్ (రిటైర్డ్ ఎస్ఐ, సీఎస్‌బీ, కరీంనగర్) బుర్ర ఎల్లయ్య గౌడ్ (రిటైర్డ్ ఎస్ఐ, సీఎస్‌బీ, కరీంనగర్) మొగురం సుధాకర్ (రిటైర్డ్ ఎస్ఐ, సీసీఆర్‌బీ, కరీంనగర్) బి. అంజయ్య (రిటైర్డ్ ఎస్ఐ, సీఎస్‌బీ, కరీంనగర్) జి. వెంకటస్వామి (రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్, మానకొండూరు పోలీస్ స్టేషన్) తోట మల్లయ్య (రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్, సీఏఆర్, కరీంనగర్) జి. ఉపేందర్ (రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్, సైదాపూర్ పోలీస్ స్టేషన్) లకు అడిషనల్ డీసీపీ వెంకటరమణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్సై మామిడి సురేందర్, ఇతర అధికారులు, పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# సీసీ రోడ్డు పనులను పరిశీలించిన ఎంపిడిఓ

తల్లాడ, జూన్ 30 (తెలంగాణ వాణి) :



మండల పరిధిలో మల్లవరం గ్రామంలో నూతనంగా చేపట్టిన సిమెంట్ కాంక్రీట్ (సీసీ) రోడ్డు నిర్మాణ పనులను ఈరోజు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఓ) శ్రీధర్ రాజు, గౌరవ సర్పంచ్ కటిక కిరణ్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ, ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. గ్రామాభివృద్ధికి రోడ్ల నిర్మాణం ఎంతో కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఎర్రి నరసింహారావు, ప్రముఖ రైతు అయినాల రామలింగయ్య, స్థానిక పంచాయతీ కార్యదర్శి సిద్ధిక్ మియా, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. రోడ్డు నిర్మాణం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# కాంట్రాక్ట్ కార్మికులను మభ్యపెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం

**రాష్ట్ర ప్రభుత్వ జీవో వల్ల కాంట్రాక్ట్ కార్మికులకు ఉపయోగమేలేదు**

**హెడ్ ఆఫీస్ గేట్ మీటింగ్ లో ఏఐటీయూసీ నాయకులు విమర్శలు**



కొత్తగూడెం సింగరేణి, జూన్ 30 (తెలంగాణ వాణి)

సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ ప్రయోజనం కలిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వేతనాలను పెంచాలని, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపు కోసం చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి కాలయాపన చేస్తూ మభ్యపెట్టడం సరికాదని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కె డబ్ల్యూ కృష్ణ ఫర్ లు విమర్శించారు. మంగళవారం కొత్తగూడెం హెడ్ ఆఫీస్ వద్ద కాంట్రాక్ట్ కార్మికుల గేట్ మీటింగ్‌ను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాలలో సరైన స్పష్టత లేదని, సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులు ప్రస్తుతం పొందుతున్న కేంద్ర ప్రభుత్వ వేతనాల కు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయించిన వేతనాలకు మధ్య పొంతనలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం వల్ల సింగరేణిలో కొన్ని విభాగాల కార్మికులకు వేతనాలు అరకొర పెరిగే అవకాశం ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మెజారిటీ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు తగ్గనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సింగరేణిలో అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు వర్తించేటట్లుగా కోల్ ఇండియాలో హై పవర్ కమిటీ వేతనాల మాదిరిగా సింగరేణిలో కూడా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడిన కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు బి కేటగిరి వేతనాల చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఎస్ఐ హాస్పిటల్స్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరారు. ఫిబ్రవరి 12వ తేదీన జరిగిన సార్వత్రిక సమ్మె సందర్భంగా ఇటువంటి పెనాల్టీ లేకుండా నోవర్క్ -నోపే సర్క్యులర్ ను విడుదల చేయాలని కోరారు. సింగరేణిలో లేబర్ కోడ్ లను అమలు చేయవద్దని, దీనికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో కాంట్రాక్ట్ కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎం చంద్రశేఖర్, రవీందర్, సలీం, మురళి, గోపి, సురేష్, సుభద్ర లక్ష్మి, ఆదిలక్ష్మి ,పద్మ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

# నేడు సింగరేణి హెడ్ ఆఫీస్ వద్ద మహాధర్నా

**ఐఎన్టీయూసీ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు రజాక్**



కొత్తగూడెం సింగరేణి, జూన్ 30 (తెలంగాణ వాణి)

జాతీయ కార్మిక సంఘాల సంయుక్త వేదిక ఆధ్వర్యంలో జూలై 1వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు సింగరేణి హెడ్ ఆఫీస్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు ఐఎన్‌టీయూసీ వర్గాలు తెలిపాయి. ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ డాక్టర్ జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగే ఈ ధర్నాలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ నాయకత్వం పాల్గొననుంది. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్ సంఘాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నాయకులు వెల్లడించారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, జేబీసీసీఐ 12వ వేతన ఒప్పంద చర్చలను తక్షణమే ప్రారంభించాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ మహాధర్నాకు కొత్తగూడెం ఏరియా ఐఎన్‌టీయూసీ సెంట్రల్ నాయకత్వం, సెంట్రల్ కమిటీ, బ్రాంచ్ కమిటీ సభ్యులు, ట్రెజరర్, ఫిట్ కార్యదర్శులు, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు, మైన్స్ కమిటీ, టెంపుల్ కమిటీ, ఫిట్ కమిటీ సభ్యులు, అన్ని యూనియన్ల నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు, డీఎల్ఆర్ కార్మికులు, పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

# సింగరేణి అధికారుల రిలే దీక్షలకు టీబీజీకేఎస్ సంఘీభావం

**బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అధికారులకు ఎంతో మేలు**

**కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతోంది**

**టీబీజీకేఎస్ రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపుకృష్ణ**






కొత్తగూడెం సింగరేణి, జూన్ 30 (తెలంగాణ వాణి)

సింగరేణి అధికారులు కొత్తగూడెం, కార్పొరేట్ ఏరియాల్లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) సంఘీభావం తెలిపింది. డివిజన్ ఉపాధ్యక్షులు గడప రాజయ్య, తుమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం రిలే దీక్ష శిబిరాలను టీబీజీకేఎస్ నాయకులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ, రాకేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాపు కృష్ణ మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాంలో అధికారులకు ఇచ్చిన ప్రయోజనాలకు భిన్నంగా కాంగ్రెస్ హయాంలో అన్యాయం జరుగుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, అధ్యాపకులు, మహిళలు, విద్యార్థులు, అసంఘటిత కార్మికులతో పాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ దుష్ట పాలన, అవినీతి చర్యలను మానుకోవాలని, అధికారులు అడుగుతున్న న్యాయమైన కోరికలు తీర్చాలని డిమాండ్ చేశారు. పీఆర్పీని వెంటనే చెల్లించాలని, పే అప్‌గ్రేడేషన్ చేయాలని, సింగరేణికి జెన్‌కో నుంచి రావాల్సిన సుమారు 56 వేల కోట్లు వెంటనే చెల్లించి సింగరేణిని కాపాడాలని కోరారు. సింగరేణి చరిత్రలో అధికారులు ర్యాలీలు, నిరాహార దీక్షలు చేయడం ఇదే మొదటిసారని, ఇప్పటివరకు ఇటువంటి ఇబ్బందికర పరిస్థితులు ఎప్పుడూ చూడలేదని అన్నారు. అధికారులు, కార్మికులు బాగుంటేనే సింగరేణి సంస్థ మనుగడ ఉంటుందని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సంఘీభావ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి వాసికార్ల కిరణ్ కుమార్, కేంద్ర కమిటీ సభ్యులు బోరింగ్ శంకర్, రవి వర్మ, బ్రాంచ్ కార్యదర్శి శివ, పిట్ కార్యదర్శులు వెంకటేష్, సూరజ్, మోయ సూర్యనారాయణ, జయపాల్, బ్రాంచ్ కార్యదర్శి విద్యా సాగర్, రాజకుమార్, రంజిత్, రాములు, వినయ్, ఖాజా, హైమద్, గౌరీ, రాజయ్యతో పాటు కార్పొరేట్ ఏరియా, కొత్తగూడెం ఏరియా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా బుర్హానుద్దిన్ బాబా ఉర్సు వేడుకలు



టేకులపల్లి, జూన్30, (తెలంగాణ వాణి)

మండలంలోని రోళ్ళపాడు సమీపంలో ఉన్న బుర్హానుద్దిన్ బాబా దర్గాలో మంగళవారం ఉర్సు మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బేతంపూడి దర్గా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉర్సు సందర్భంగా బేతంపూడి దర్గా నుంచి సంప్రదాయ బద్ధంగా గంధాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి,బుర్హానుద్దిన్ బాబా సన్నిధిలో ప్రతిష్ఠించారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# కార్మికుల న్యాయమైన వేతన హక్కులను కాలరాయొద్దు

**12వ వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలి**

**వేతన ఒప్పందంలో జాప్యం ఇక చెల్లదు**

**విలేకరుల సమావేశంలో కార్మిక సంఘాల జేఏసీ నేతలు**



కొత్తగూడెం సింగరేణి, జూన్ 30 (తెలంగాణ వాణి)

11వ వేతన ఒప్పందం ఈ నెలతో ముగుస్తున్న నేపథ్యంలో జూలై 1,2026 నుండి అమలుచేయవాల్సిన నూతన వేతన కమిటీనీ 40 శాతం ఫిట్‌మెంట్ బెనిఫిట్‌తో 12వ వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేసి వేతన ఒప్పంద ప్రక్రియను ప్రారంభించాలని కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. సోమవారం శేషగిరిభవన్‌లో జరిగిన కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని పేర్కొన్నారు. 12వ వేతన ఒప్పంద చర్చలను ఆలస్యం చేయకుండా తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ నెల ఒకటవ తేదీన దేశవ్యాప్తంగా జరుగునున్న ఆందోళన కార్యక్రమాల్లో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ముందు నిర్వహించనున్న భారీ సంయుక్త ధర్నాను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అదే రోజు అన్ని గనులు, విభాగాల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాసే ప్రతి ప్రయత్నాన్ని ఐక్య ఉద్యమాలతో తిప్పికొడతామని హెచ్చరించారు. కోట్లాది రూపాయల లాభాలను ఆర్జిస్తున్న బొగ్గు పరిశ్రమలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న కార్మికులకు న్యాయమైన వేతన ఒప్పందాన్ని అమలు చేయకుండా కాలయాపన చేయడం తీవ్ర అన్యాయమని మండిపడ్డారు. అదేవిధంగా నాలుగు లేబర్ కోడ్‌లను పూర్తిగా రద్దు చేసి, 12వ వేతన ఒప్పంద ప్రక్రియ ప్రారంభించే వరకు తమ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడకపోతే దేశవ్యాప్తంగా మరింత ఉధృతమైన ఆందోళనలకు చేపడుతామని హెచ్చరించారు. కార్మికుల ఐక్యశక్తి ముందు కార్మిక వ్యతిరేక విధానాలు నిలవవని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, సెంట్రల్ కార్యదర్శి వంగ వెంకట్, వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శులు, మల్లికార్జున్ రావు, రమణమూర్తి, క్రిస్టోఫర్, కత్తర్ల రాములు, గట్టయ్య, హుమాయూన్, మాతంగి లింగయ్య, బండారి మల్లయ్య, మండల రాజేశ్వరరావు, ఐ ఎన్ టీ యు సి సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, వైస్ ప్రెసిడెంట్ పీతంబరం, ఆల్బర్ట్, మధుసూదన్, ఎం.శ్రీనివాస్. సి ఐ టి యు నుండి మంద నర్సింహారావు, విజయగిరి శ్రీనివాస్, వై.వి రావు. తదితరులు పాల్గొన్నారు.

# ఏరియా వర్క్‌షాప్‌లో ఫిట్టర్ పల్లప్రోలు ప్రసాద్ పదవీ విరమణ

**ఘనంగా సన్మానించిన అధికారులు, ఉద్యోగులు, యూనియన్ నాయకులు**

**కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలి : ఏరియా ఉపాధ్యక్షులు ఎండి రజాక్**



కొత్తగూడెం సింగరేణి, జూన్ 30 (తెలంగాణ వాణి)

సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియాలోని ఏరియా వర్క్‌షాప్‌లో ఫిట్టర్‌గా విధులు నిర్వహించిన పల్లప్రోలు ప్రసాద్ 34 సంవత్సరాల సుదీర్ఘ సేవల అనంతరం మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏరియా వర్క్‌షాప్ హెచ్‌వోడీ జే. క్రిస్టఫర్ ఆధ్వర్యంలో పల్లప్రోలు ప్రసాద్‌కు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులతో పాటు అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొని శాలువాలు, జ్ఞాపికలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు ఎం.డి. రజాక్, వర్క్‌షాప్ ఇంజినీర్లు బి. శంకర్, టి. అనిల్, ఏ. ఉపేందర్ బాబు, ఐఎన్‌టీయూసీ ఫిట్ కార్యదర్శి ఎండి సత్తార్ పాషా, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మధుకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పల్లప్రోలు ప్రసాద్ వర్క్‌షాప్‌లో 34 సంవత్సరాల పాటు వృత్తినే దైవంగా భావించి క్రమశిక్షణ, అంకితభావంతో సేవలందించారని కొనియాడారు. విధి నిర్వహణలో అలసట లేకుండా పనిచేస్తూ అధికారులు, సహోద్యోగుల మన్ననలు పొందారని పేర్కొన్నారు. ప్రత్యేకంగా పంపు సెక్షన్‌లో పంపుల మరమ్మతుల విషయంలో ఆయనకు విశేష నైపుణ్యం ఉందని, సహచరులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ అందరితో కలిసిమెలిసి పనిచేసేవారని తెలిపారు. ఆయన మృదుస్వభావి, సౌమ్యుడిగా అందరి అభిమానాన్ని చూరగొన్నారని అన్నారు. పదవీ విరమణ అనంతరం పల్లప్రోలు ప్రసాద్ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్, బి.వెంకట్రాం, యు.రమేష్ బాబు, రోషన్, ఎస్డి.యాకుబుద్దీన్, సుంకర రామచంద్రరావు, కరుణాకర్, జూనియర్ అసిస్టెంట్ జాన్ కెనడి,మెంగని అశోక్, బొజ్జ వెంకటస్వామి, శ్రీకాంత్ శర్మ, జయరాజ్,ఆర్.ప్రసాద్, మేకల గిరిబాబు, కాసర్ల మోహన్, కే కొండల్, కె.సత్యనారాయణ, కె.వి రావు, పయ్యాల ప్రవీణ్ కుమార్, శ్రీమన్నారాయణ, పరశురాం, వై ఈశ్వరరావు, సుందర్ రాజ్, రవికుమార్, చందులాల్, బి.గోపాల్, జడల చంద్రశేఖర్, అథర్, అల్తాఫ్, బాబుదిన్, ప్రభాకర్, ఎండి రహీం, సలిగంటి శ్రీనివాస్, కిరణ్ కుమార్, కొప్పుల కుమార్, ఖాజా పాషా, కరీం, నరేష్, రాజయ్య, బింగి గోపాల్,రెడ్డి బాలరాజు,టీ.రాజు, రమేష్, చిప్ప నరేష, బెల్లంకొండ, ఆర్ మహేష్, కట్ట. నరసింహారావు, జీవీఎల్ శ్రీనివాస్, దుర్గ ప్రసాద్, కళ్యాణ్, హరీష్, గుమ్మడి మురళి, చిరంజీవి, వెంకటేశ్వర్లు, సముద్రాల శ్రీనివాస్,సమ్మయ్య, రాజయ్య, వెంకటేశ్వరరావు,బండి సంపత్, గౌస్ మహమ్మద్, జివిఎల్, డి సమ్మయ్య, అజ్మీర కిషన్, ఎస్కే రియాజ, వేణుగోపాల్, మోహన్లాల్, యేసు రత్నం, మహేష్, ప్రకాష్, వెంకట దుర్గ,వాసంతిక, సంధ్యారా ణి, అనూష,రమణ, నాయకులు, కార్యకర్తలు, ఆల్ ట్రేడ్ ఫ్రెండ్స్ లు, డిఎల్ఆర్ కార్మికులు, మిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తాడిచెర్ల ఓసీపీలో సెక్యూరిటీ గార్డుల ఆందోళన

**విధులను బహిష్కరించి నిరసనకు దిగిన 150 మంది సిబ్బంది**

**కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్**



జయశంకర్ భూపాలపల్లి, జూన్ 30 (తెలంగాణ వాణి ప్రతినిధి)

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్రావు మండలం తాడిచెర్ల ఓసీపీలో సెక్యూరిటీ గార్డుల ఆందోళనతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమకు కనీస వేతనాలు, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సుమారు 150 మంది సెక్యూరిటీ గార్డులు విధులను బహిష్కరించి మంగళవారం ఓసీపీ గేటు వద్ద నిరసన చేపట్టారు. గత మూడు రోజులుగా విధులకు దూరంగా ఉన్న గార్డులు, తమను కాంట్రాక్ట్ ఏజెన్సీ తీవ్రంగా ఇబ్బంది పెడుతుందని ఆరోపించారు. కార్మిక చట్టాల ప్రకారం చెల్లించాల్సిన కనీస వేతనాలు అందడం లేదని, ప్రస్తుతం రోజుకు సుమారు రూ.400 మాత్రమే చెల్లిస్తున్నారని, ఆ వేతనాలను కూడా సకాలంలో ఇవ్వడం లేదని వారు పేర్కొన్నారు. కార్మిక చట్టాల ప్రకారం నెలకు కనీస వేతనం రూ.18 వేల వరకు చెల్లించాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గత ఏడు సంవత్సరాలుగా సంస్థలో పనిచేస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం ప్రశ్నించిన కొందరు గార్డులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడి విధుల నుంచి తొలగించారని కార్మికులు ఆరోపించారు. గత కొన్నేళ్లలో పలువురు పాత సిబ్బందిని తొలగించి కొత్తగా నియామకాలు చేపట్టినట్లు కూడా పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం అందించాల్సిన యూనిఫాంలు, షూస్ వంటి సౌకర్యాలు సక్రమంగా ఇవ్వడం లేదని, వాటికి సంబంధించిన ఖర్చులను జీతాల నుంచి మినహాయిస్తున్నారని గార్డులు తెలిపారు. సమస్యలపై ప్రశ్నిస్తే బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తమ డిమాండ్లపై యాజమాన్యం, సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని, సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని సెక్యూరిటీ గార్డులు స్పష్టం చేశారు.

# తాడిచెర్ల, మణుగూరు పీకే ఓసీ డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టును సింగరేణికి కేటాయించాలి

**కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి ఏబీకేఎంఎస్ బిఎంఎస్ విజ్ఞప్తి**

**ఇల్లందు పూసపల్లి ఓసీ ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలి**

**12వ వేతన కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలి**

**సింగరేణికి రావలసిన రు. 56 వేల కోట్లు బకాయిలు ఇప్పించాలి**

**సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రిత్వరలో చర్యలు తీసుకుంటామని హామీ**



కొత్తగూడెం సింగరేణి, జూన్ 30 (తెలంగాణ వాణి)

ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి అభివృద్ధి కోసం కొత్త బొగ్గు గనులు ఏర్పాటుతోపాటు ప్రైవేట్ కాంట్రాక్టర్ల ఆధీనంలో ఉన్న బొగ్గు గనులను సింగరేణికి కేటాయించాలని బి ఎం ఎస్ అనుబంధ ఏ బి కే ఎం ఎస్ నాయకులు కోరారు. మంగళవారం ఈ మేరకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ ప్రతినిధుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందించారు. అయితే తాడిచెర్ల బొగ్గు బ్లాక్, మణుగూరు పీకే ఓసీ– డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టును సింగరేణి కాలరీస్ కంపెనీ కు కేటాయించాలని కోరుతూ సమగ్ర వినతిపత్రాన్ని అందించినట్లు ఆ యూనియన్ నాయకులు పేర్కొన్నారు.అదేవిధంగా ఇల్లందు ఏరియాలో పూసపల్లి ఓసీ ప్రాజెక్టును వెంటనే ప్రారంభించేందుకు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే 12వ వేతన కమిటీని తక్షణమే ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. అంతేగాక రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణి సంస్థకు రావలసిన రు. 56 వేల కోట్ల బకాయిలను తక్షణమే ఇప్పించాలని ఆ వినతిపత్రంలో కోరారు.ఈ సందర్భంగా ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు పి. మాధవ నాయక్, అధ్యక్షులు అప్పాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమారస్వామి మాట్లాడారు. అయితే తాడిచెర్ల బొగ్గు బ్లాక్, మణుగూరు పీకే ఓసీ– డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టుల ప్రాధాన్యతను కేంద్ర మంత్రివర్యులకు సవివరంగా వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రస్తుతం సింగరేణిలోని పలు బొగ్గు గనుల్లో నిల్వలు క్రమంగా తగ్గిపోతుండటంతో భవిష్యత్తులో కొన్ని గనులు మూతపడే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందన్నారు. దీని వల్ల వేలాది మంది కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని తెలిపారు.తాడిచెర్ల బొగ్గు బ్లాక్‌లో సుమారు 277 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గు నిల్వలు, మణుగూరు పీకే ఓసీ– డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టులో సుమారు 215 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని వివరించారు.బొగ్గు తవ్వకాలలో సింగరేణికి ఉన్న అపార అనుభవం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సమర్థవంతమైన యంత్రాంగం, మౌలిక సదుపాయాలను దృష్టిలో ఉంచుకొని ఈ రెండు ప్రాజెక్టులను సింగరేణికే కేటాయించడం సంస్థ భవిష్యత్తుకు ఎంతో అవసరమని పేర్కొన్నారు.అదేవిధంగా ఇల్లందు పూసపల్లి ఓసీ ప్రాజెక్టును వెంటనే ప్రారంభించేలా సింగరేణి అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 12వ వేతన కమిటీ ఏర్పాటు కోసం కోల్ ఇండియా యాజమాన్యంతో సంప్రదించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ వినతిపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. తాడిచెర్ల బొగ్గు బ్లాక్, మణుగూరు పీకే ఓసీ– డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టును సింగరేణికి కేటాయించే దిశగా త్వరలోనే చర్యలు తీసుకుంటామని వివరించినట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. అలాగే 12వ వేతన కమిటీ ఏర్పాటు విషయమై కోల్ ఇండియా అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చినట్లు వివరించారు.కేంద్ర మంత్రి ఈ సానుకూల స్పందన సింగరేణి కార్మికుల్లో కొత్త ఆశలను నింపిందని ఏ బి కే ఎం ఎస్– బిఎంఎస్ నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా సింగరేణి కార్మికుల తరఫున కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి కి హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు.తాడిచెర్ల బ్లాక్, మణుగూరు పీకే ఓసీ– డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టులు సింగరేణికి కేటాయిస్తే సింగరేణికి అనేక ప్రయోజనాలున్నాయన్నారు. సింగరేణి సంస్థ భవిష్యత్తు మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.వేలాది మంది కార్మికుల ఉపాధి భద్రతకు శాశ్వత భరోసా లభిస్తుందిని,తెలంగాణ రాష్ట్ర



పారిశ్రామికాభివృద్ధికి, దేశ ఇంధన భద్రతకు ఇది కీలకంగా మారుతుందని వివరించారు. దేశీయ బొగ్గు ఉత్పత్తి పెరిగి, బొగ్గు దిగుమతులపై ఆధారపడటం గణనీయంగా తగ్గుతుందని తెలిపారు.సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ ఎల్లప్పుడూ కార్మికుల సంక్షేమం పరిశ్రమ ప్రగతి దేశాభివృద్ధి అనే సిద్ధాంతంతో పనిచేస్తూ, సింగరేణి అభివృద్ధి, కార్మికుల హక్కుల పరిరక్షణ, దేశ ఇంధన స్వావలంబన కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని పేర్కొంది.ఈ ఉద్యమానికి సింగరేణి కార్మికులందరూ సంఘీభావం ప్రకటించి బి ఎం ఎస్ కు తమ సంపూర్ణ మద్దతు అందించాలని విజ్ఞప్తి చేసింది.ఈ కార్యక్రమంలో మండా రమాకాంత్, పులి రాజిరెడ్డి, అప్పాని శ్రీనివాస్, వడ్డేపల్లి కుమారస్వామి, యాదగిరి సత్తయ్య, వై సారంగపాణి, జీవి కృష్ణ రెడ్డి, ఏ. వెంకటేశ్వర్లు, మొగిలిపాక రవి కుమార్, బి.కిషన్, అల్లి ప్రకాష్ రావు, సాయివేణి సతీష్, హరిణ్ పటేల్, నాయిని సైదులు, లీలా కృష్ణ, దశరథం, పి. శ్రీనివాస్ సత్కారి శ్రీనివాస్, పందాల మల్లేష్, ఆర్. నర్సింగ రావు, రూపేశ్వరచారి, కర్రవుల మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.